క్లుప్తంగా

జాతీయ స్థాయి 2వ ర్యాంకర్‌కు అభినందన



సూర్యతేజ, తల్లిదండ్రులను సన్మానిస్తున్న విజయం కళాశాల యాజమాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల విడుదలైన ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి 2వ ర్యాంక్ సాధించిన సూర్యతేజకు మంగళవారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ, చిత్తూరు విద్యార్థి ఐఐటీ జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరీలో 2వ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం సూర్యతేజ, తల్లిదండ్రులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఈడీ శైలజ, ప్రిన్సిపల్ జీవరత్నం పాల్గొన్నారు.

ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ

ఐరాలలో దామోదర్‌నాయుడు



దామోదర్‌నాయుడును సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఐరాల: మండల విద్యాశాఖాధికారి–2గా దామోదర్‌నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పూతలపట్టు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఐరాలకు బదిలీ అయ్యారు. ఆయనకు యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు, స్థానిక ఉపాధ్యాయులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

బంగారుపాళెంలో రమేష్‌బాబు



రమేష్‌బాబును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండల విద్యాశాఖ అధికారి–2గా రమేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని బోడబండ్ల జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతి పొందారు. విద్యాభివృద్ధికి ఎంఈఓ నాగేశ్వర్‌రావుతో కలసి పనిచేస్తానని ఆయన చెప్పారు. రమేష్‌బాబును ఎంఈఓతో పాటు జిల్లా పీఆర్‌టియూ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్యాణ మండప నిర్మాణానికి మార్కింగ్

చిత్తూరు రూరల్: చిత్తూరులోని నీవానది ఒడ్డున రాములవారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి మంగళవారం ఆలయ అధికారులు, నిర్వాహకులు మార్కింగ్ పనులకు పూనుకున్నారు. ఆ స్థలాన్ని చదును చేశారు. ఇటీవల ప్రభుత్వం కల్యాణ మండప నిర్మాణానికి రూ.97 లక్షలు కేటాయించిందని, త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఈఓ సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

పునరావాస ఇళ్లకు రిజిస్ట్రేషన్ ప్లీజ్!

చిత్తూరు కలెక్టరేట్ : పునరావాస ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని శ్రీలంక, బర్మా కాందిశీకుల సంఘం నాయకులు రాజా, ఆ సంఘ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో రాజశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రపంచ కాందిశీకుల దినోత్సవం సందర్భంగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లాలో పునరావాసం కల్పించబడిన శ్రీలంక, బర్మా కాందిశీకుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని కాందిశీకులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు

బంగారుపాళెం: స్థానిక రాజావీధిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ–2 రమేష్‌బాబు, ఎంఈఓ–1 నాగేశ్వరరావు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనంజయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిగువమత్యంలో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: గ్రామీణ పేద ప్రజల ముంగిటే వైద్యసేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో లక్ష్యమని వైద్యాధికారి మోహన్‌వేలు అన్నారు. మండలంలోని దిగువమత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమం, పౌర సేవలు





చిత్తూరు : సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ , హాజరైన సచివాలయ సిబ్బంది

చిత్తూరు అర్బన్: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సేవలను అందించడమే లక్ష్యంగా 'జగనన్న సురక్ష'ను ప్రవేశపెడుతోందని నగర కమిషనర్ జె.అరుణ అన్నారు. 'జగనన్న సురక్ష'పై మంగళవారం 50 వార్డు సచివాలయాల వలంటీర్లు, వార్డు కార్యదర్శులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, జూలై 1 నుంచి ప్రారంభం కానున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం కోసం నగరపాలక సంస్థ పరిధిలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా సచివాయాలకు చెందిన వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి 'జగనన్న సురక్ష'పై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఆ గృహంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా? విద్యార్థులకు, యువత, ఇతర పథకాల లబ్ధి కోసం సర్టిఫికెట్లు ఏమైనా అవసరం ఉందా? సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అర్హులుగా ఉన్నా ఏదైనా పథకం నుంచి లబ్ధి కలగాల్సి ఉందా? అనే సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరించాలన్నారు. ఈ సమాచారం ఆధారంగా ఆయా వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించే ప్రత్యేక క్యాంపులో వారికి అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా ఇస్తామన్నారు. సంక్షేమ పథకాలలో లబ్ధి కోసం 1902 ద్వారా గ్రీవెన్స్‌లో నమోదు చేస్తామన్నారు. సమగ్ర సమాచార సేకరణ నిమిత్తం ప్రత్యేక యాప్‌ను తెస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కార్యదర్శులు, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ రాంగణేష్, వార్డు కార్పొరేటర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశం, దానిని అమలు చేయడంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పోషించాల్సిన పాత్ర గురించి మార్గదర్శనం చేశారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

బంగారుపాళెం: జగనన్న సురక్ష పథకంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సుపరిపాలన అందించడం కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పథకం అమలులో భాగంగా జూలై నుంచి వలంటీర్లు, అధికారులు గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలకు అర్హత కలిగిననూ లబ్ధి పొందని వారిని గుర్తించి, వారికి పథకాలు ఫలాలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, వలంటీర్లు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: జగన్నన సురక్షపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వలంటీర్లకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ గౌరి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని సురక్ష యాప్‌లో నమోదు చేయాలని, వారం తరువాత అధికారులు ఈ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. జగనన్న సురక్షలో ఏమేం చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

గుడిపాలలో..

గుడిపాల: జగనన్న సురక్ష పథకం అమలుపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓ, డిజిటల్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ రాజశేఖర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష పథకం అమలుకు సంబంధించి ప్రజల అవసరాలు, వారికి కావలసిన సర్టిఫికెట్ల గురించి తెలుసుకునేందుకు సర్వే చేయాలన్నారు. జూలై నుంచి ప్రతి సచివాలయంలో క్యాంపులు నిర్వహిస్తామని, అదే రోజు లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. కుల ధ్రువీకరణ, ఆదాయ, జనన, మరణ, వివాహ, ఫ్యామిలీ సర్టిఫికెట్ల మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ ఉపేంద్ర పాల్గొన్నారు.



బంగారుపాళెం : అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి



పూతలపట్టు : మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి



గుడిపాల : మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి

వేడుకగా సుభద్ర కల్యాణం



పాండవుల వనవాసం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

యాదమరి: మండలంలో చెన్నారెడ్డి పల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా మంగళవారం సుభద్ర కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో అర్జున, సుభద్రల విగ్రహాలను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించి మండపంలో కొలువుదీర్చి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం పాండవుల విగ్రహాలను వీధులలో ఊరేగించారు. రాత్రి ఆలయం వద్ద పాండవుల వనవాసం నాటకాన్ని ప్రదర్శించారు.

ఆర్‌ఎంపీ, పీయంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

యాదమరి: స్థానిక ఆర్‌ఎంపీ, పీయంపీలు రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, అలాకాకుండా ఇంజెక్షన్లు, మందులు ఇచ్చినా కేసులు నమోదు చేస్తామని యాదమరి ప్రభుత్వాసుపత్రి వైద్యులు సురేఖ హెచ్చరించారు. ఆమె మండలంలో పలు ఆర్‌యంపీ, పీయంపీ ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. చాలామంది రోగులకు ఇంజెక్షన్లు వేస్తున్నారని, అలాగే మందులు వారే రోగులకు ఇస్తున్నారని గుర్తించారు. మరోసారి ఇవి పునరావృతమైతే క్రిమినల్ కేసులు బనాయిస్తామన్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. చాలామంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో తనిఖీలు చేసినట్లు చెప్పారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం తవణంపల్లె దిగువ అరుంధతివాడ, కక్కలమిట్ట, ఉత్తర బ్రాహ్మణపల్లె, యాబీపల్లె దళితవాడ, యాబీపల్లె వడ్డిపల్లె గ్రామాల్లో వర్షంలోనే తడుస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లు అందజేసి వివరించారు. ప్రతి కుటుంబానికీ వివిధ సంక్షేమ పథకాలను దరి చేరుస్తున్న తమ ప్రభుత్వానికి అందరూ అండగా నిలబడాలని, వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, సిమెంటు రోడ్లు వేయాలని, ఉత్తరబ్రాహ్మణపల్లె రోడ్డు నుంచి వడ్డిపల్లె వరకు రోడ్డు బాగు చేయాలని, పైపులైన్లు వేసి తాగునీరు సరఫరా చేయాలని, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఉత్తర బ్రాహ్మణపల్లె పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేసి అధికారులు, సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గడప గడప కార్యక్రమంలో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



దిగువ అరుంధతివాడలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పొలికల్ బఫూన్‌గా పవన్ కల్యాణ్

చంద్రబాబు తమ పార్టీ మేనిఫెస్టోను మక్కికి మక్కీ కాపీ కొట్టి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎమ్మెల్యే అపహాస్యం చేశారు. తానెందుకు రాజకీయాల్లో వచ్చాడో నిలకడ, స్పష్టత లేదని పవన్‌కల్యాణ్ తన మాటలు, చేతల్లో చాటుకుంటూ నవ్వులపాలవుతున్నాడని, తొలినాళ్లలో చంద్రబాబును ఎంతగా విమర్శించాడో అందరికీ తెలుసని, ఇప్పుడు అందే చంద్రబాబు చంకనెక్కి, పొలిటికల్ బఫూన్‌గా ముద్ర వేసుకుంటున్నాడని వ్యంగ్యంగా అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు బాబు, డేవిడ్, సర్పంచ్ దేవరాజులు, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి, పార్టీ నాయకులు గాంధీబాబు, దామోదరం, మధుకుమార్, గణేష్, కిషోర్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, విక్రమ్‌రెడ్డి, మురుగన్, విజయ్‌కుమార్, జానకిరాం, యుగంధర్, బాలాజి, పూర్ణచంద్ర, ప్రభాకర్, మధుకుమార్ రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ! చాలా థ్యాంక్స్

ఎమ్మెల్యే: ఎందుకు పెద్దాయన?

పెద్దాయన: మా ఊరికి నువ్వు చాలాసార్లు వచ్చినావయ్యా. సమస్యలు అడిగి తెలుసుకుంటున్నావు. గవర్నమెంట్ పథకాలు అందుతున్నాయా, లేదా? అని అడుగుతాండావు. ఇంతకు ముందంతా ఎలక్షన్ టైంలో తప్పితే వచ్చేవాళ్లు కాదు ఎమ్మెల్యేలు. అందుకే థ్యాంక్స్ చెబుతున్నా.

ఎమ్మెల్యే : ఇది మా ప్రభుత్వ కార్యక్రమం పెద్దాయనా! అందుకే ప్రతి ఇంటికీ వస్తున్నా..సమస్యలు తెలుసుకుంటున్నా..సరేగానీ నీకేమైనా సమస్యలున్నాయా?

పెద్దాయన: అయ్యా! నాకే సమస్యలూ లేవు. ప్రభుత్వం దయవల్ల మా ఇంటికి పథకాలు వస్తాండాయి. నాకు పింఛను ఇస్తాండారు. చాలా సంతోషం నాయనా..

ఎమ్మెల్యే : అయితే ఈసారి ఎలక్షన్‌లో ఎవరికి ఓటేస్తావ్?

పెద్దాయన: ఇంకెవరికి? మన జగన్ బాబుకు.. ఫ్యాన్ గుర్తుకే వేస్తాను (నవ్వుతూ) పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు, రామయ్య(76)కు నడుమ ఈ ఆసక్తికర సంభాషణ తవణంపల్లె మండలం వడ్డిపల్లెలో చోటుచేసుకుంది. సంభాషణ అనంతరం ఎమ్మెల్యే ఆ పెద్దాయనతో కరచాలనం చేసి ముందుకుసాగారు. –యాదమరి



వడ్డిపల్లెలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబుతో కరచాలనం చేస్తున్న పెద్దాయన

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న క్యాంఫోర్డ్ విద్యార్థులు

తవణంపల్లె: జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం తవణంపల్లెలో వైద్యాధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రతి రోజూ యోగాసనాలు వేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. ర్యాలీలో సీహెచ్‌ఓ వెంకటరమణ, పీహెచ్‌ఎన్ భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు కలెక్టరేట్ : యోగా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోందని బెంగళూరుకు చెందిన యోగా శిక్షకులు జయప్రకాష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మెసానికల్ మైదానంలో క్యాంఫోర్డ్ పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం యోగా శిక్షకులు జయప్రకాష్, శివప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్: నిరంతర యోగసాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చని డీపీఎంఓ హర్షవర్ధన్ అన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు యోగ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, యోగసాధనను దిన చర్యగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు గుణశేఖర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



తవణంపల్లె : యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



చిత్తూరులో ర్యాలీ చేస్తున్న అధికారులు

విద్యాహక్కు చట్టంపై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు విద్యాహక్కు చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్.. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలను సంధించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ, పాఠశాల అంటే కులమతాలకు అతీతంగా, బాలబాలికలకు సమానంగా చూసే ప్రదేశాన్ని పాఠశాల అంటారని నిర్వచించారు. అంతకుముందు పాఠశాల అంటే ఏమిటని విద్యార్థులను ఆయన ప్రశ్నించి వారికి పాఠశాల అంటే ఏ భావనతో ఉన్నారో తెలుసుకున్నారు. విద్యార్థి దశ నుంచే హక్కులను, చట్టాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వాలు విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తెరిగి, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అన్నింటా రాణించాలని మార్గదర్శనం చేశారు. డీఈవో విజయేంద్రరావు మాట్లాడుతూ డ్రాపౌట్స్‌ను తిరిగి స్కూళ్లలో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్‌రావు మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువుకోవాల్సిన పిల్లలు ఎక్కడైనా పనిచేస్తుంటే 1902కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ–1 సెల్వరాజ్, ఎంఈఓ–2 మోహన్, సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్ అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎం పూర్ణిమ, పీడీ కోమల, సీడీపీవో నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

'స్పందన' కాల్‌సెంటర్ తనిఖీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని స్పందన కాల్‌సెంటర్‌ను మంగళవారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను, పలు గ్రీవెన్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్పందనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. శాఖల వారీగా వచ్చిన స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర

యాదమరి: మండలంలోని మాధవరం దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతరను వేడుకగా నిర్వహించారు. అమ్మవారికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ సురేష్ నేతృత్వంలో నడివీధి గంగమ్మను ప్రత్యేక పూజలు చేసి విశ్వరూపం ప్రతిష్ఠించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్, చిత్తూరు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్పు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పూజాసామగ్రి సమర్పించారు. సాయంత్రం ప్రముఖ పారిశ్రామికవేత్త బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిల్లారిపల్లెలో..

గుడిపాల: మండలంలోని కిల్లారిపల్లెలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం మహిళలందరూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి పోశారు. మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు.



పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్



నడివీధి గంగమ్మకు పూజలు చేస్తున్న నాయకులు



గుడిపాల: కిల్లారిపల్లెలో..

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి

ఐరాల: ఆర్‌బీకే సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఏడీఏ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎం.పైపల్లె రైతుభరోసా కేంద్రంలో సిబ్బందికి సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండలంలో ఈ నెలాఖారు లోపు 420 మట్టి నమూనాలు రైతుల నుంచి సేకరించి తిరుపతిలోని భూసార ప్రయోగశాలకు పంపాలన్నారు. కౌలు రైతులను గ్రామ సచివాలయ పరిధిలోనే అధికారులు గుర్తించి, గ్రామ సభల ద్వారా పంటలసాగు హక్కు పత్రాలను ఇవ్వాలన్నారు. మండలంలో 250 హెక్టార్లలో రాగి పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి పాల్గొన్నారు.



ఎం.పైపల్లె రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న ఏడీఏ మధుసూదన్‌రెడ్డి